క్లుప్తంగా

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



కోలాట ప్రదర్శనలో జడ్డంగి చిన్నారులతో ట్రైనర్ లక్ష్మి

రాజవొమ్మంగి: గణపతి నవరాత్రి మహోత్సవాల నేపథ్యంలో శనివారం రాత్రి మండలంలోని జడ్డంగిలో 20 మంది చిన్నారుల కోలాట ప్రదర్శన అందరిని అలరించింది. ఈ బృందం తిరుమల తిరుపతి, మంగాదేవి ఆలయాల్లో కూడా పలుమార్లు ప్రదర్శనలు ఇచ్చి పలువురి ప్రశంసలు అందుకున్నట్టు శిక్షకురాలు కుప్పిలి లక్ష్మి తెలిపారు. ఆలయాల వద్ద, పర్వదినాల్లో ఈ చిన్నారులు ప్రదర్శనలు ఇస్తున్నారు.

ఎస్ఐగా సురేష్ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్

హుకుంపేట: మండల ఎస్ఐ ఎల్.సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అనకాపల్లి జిల్లా రోలుగుంట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా హుకుంపేట స్టేషన్‌లో ఎస్ఐగా చేరారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సతీష్ అనకాపల్లి జిల్లా చీడికాడ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



నెల్లిపాకలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

ఎటపాక: వినాయక నవరాత్రి మహోత్సవాలు మండలంలో వైభవంగా జరుగుతున్నాయి. ఊరూ వాడ అంత ఉత్సవాలతో సంబరాలు జరుపుతున్నారు. నెల్లిపాక, తోటపల్లి, గన్నవరం, గౌరిదేవిపేట తదితర ప్రాంతాల్లో మండపాల వద్ద ఆదివారం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లిపాకలో మహిళలు శివలింగాకృతిలో దీపాలు వెలిగించి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మండపాల వద్ద భజన కార్యక్రమాలు కూడా వైభవంగా జరుపుతున్నారు.

ఆత్మీయ వీడ్కోలు



జి.మాడుగుల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసరావును సన్మానిస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్ఐ తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వహించి మన్ననలు పొందారని పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎస్ఐ శ్రీనివాసరావును సిబ్బంది, గ్రామస్తులు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఏఎస్ఐ, హెచ్‌సీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావును విశాఖపట్నం వీఆర్‌కు, పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేసిన ఎస్ఐ షణ్ముఖరావును స్థానిక పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

మండల సమావేశం రేపు

అరకులోయ రూరల్: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటేష్ ఆదివారం తెలిపారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు ఉదయం 10 గంటలకు విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

చిరుధాన్యాలు.. లాభాల సిరులు



భీమలోయలో వేరుశనగ పంట



తాసేరుబయలులో మొక్కజొన్న పంట



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి పాత్రుడు, ఎఫ్‌పీవో సభ్యులు

- మార్కెట్‌లో గిరాకీ
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- లాభాలతో గిరిజన రైతుల ఆనందం
- అధికారుల సూచనలు, సలహాలు

జి.మాడుగుల: ప్రస్తుతం ఆరోగ్యంపట్ల ప్రతీ ఒక్కరికి శ్రద్ధ పెరిగింది. ఆహార నియమ నిబంధనలు పాటిస్తున్నారు. ఎక్కువ పోషకాలు ఇచ్చే చిరుధాన్యాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. పూర్వం తృణధాన్యాల వినియోగం ఎక్కువగా ఉండేది. మారుతున్న కాలానుగుణంగా వినియోగం తగ్గిపోయింది. అయితే విస్తృత పరిశోధనల అనంతరం విదేశాల్లో సైతం చిరుధాన్యాల వినియోగం పెరిగింది. చిరుధాన్యాల్లో బలవర్ధమైన పోషక విలువలున్నట్టు గుర్తించారు. ఆరోగ్యానికి దోహదం చేసే చిరుధాన్యాల వినియోగం గణనీయంగా పెరిగింది. దీంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ నెలకొంది. మన్యంలో ఒకప్పుడు తక్కువగా పండించే చిరుధాన్యాలను నేడు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో రైతులు చిరుధాన్యాల పంటలు పండించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఫలితంగా ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు.

ప్రకృతి సాగుకే ప్రాధాన్యం

రసాయన ఎరువులకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయం పద్ధతుల ద్వారా సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ పంటల సాగు చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో సేంద్రియ ఎరువుల ద్వారానే అనేక పంటలు పండిస్తున్నారు. వ్యవసాయశాఖ, హార్టికల్చర్ ఆధ్వర్యంలో రైతులను చిరుధాన్యాల సాగుపట్ల శ్రీమత్స్యదేవత రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో)ప్రోత్సహిస్తోంది. నాబార్డు నిధులు సమకూర్చుతుంది. సంఘ సభ్యులకు పంటసాగు విధానాలపై గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చి కేంద్రం(ఐఐఎంఆర్)గిరిజన రైతులకు రాజ్‌మా, మొక్కజొన్న, సామలు, రాగులు, కొర్రలు, జొన్నలు, ఊదలు, వేరుశనగ తదితర విత్తనాలను ఉచితంగా అందజేస్తుంది. వాతావరణం, పంటలపై అవగాహన కల్పించటం, వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు పంటల సాగులో దిగుబడులు సాధించటానికి వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్నారు. పంటలకు ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించకుండా రెండేళ్లుగా పంటలు పండిస్తున్నారు. దీంతో రైతులు మంచి ఫలితాలు సాధించి లాభాల బాటలో పయనిస్తున్నారు. తాసేరుబయలు, భీమలోయ గ్రామాల్లో ఐఐఎంఆర్ సమకూర్చిన 500 ఎకరాలకు మిల్లేట్ విత్తనాలను రైతుల ద్వారా వేయించారు. చిరుధాన్యాల పంటలు పండించి రైతులకు ఆర్థికాభివృద్ధికి కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు సంస్థ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీమత్స్యదేవత ఎఫ్‌పీవోకు హార్టికల్చర్ శాఖ ద్వారా కలెక్షన్ సెంటర్, కోల్డ్



రైతులకు చిరుధాన్యాల విత్తనాలిస్తున్న అధికారులు

స్టోరేజీ ఏర్పాటుకు రూ.15లక్షలు ఈక్విటీ గ్రాంట్ పొందటానికి 750 మంది రైతులకు సభ్యత్వ సమీకరణకు ప్రణాళిక రూపొందించారు. రైతులు పండించే పంటల విలువ జోడింపు చేయడం ద్వారా మరింత ఆదాయాన్ని సంస్థకు చేకూర్చటం, వ్యాపార కార్యకలాపాలకు కోసం ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకోవటం వంటి ప్రణాళికల ఉంది.తాసేరుబయలు గ్రామంలో 2023లో 200ఎకరాల్లో చిరుధాన్యాల పంటను వేశారు. 2024లో 500 ఎకరాల్లో పండిస్తున్నారు.

దిగుబడి బాగుంది



మత్స్యదేవత ఎఫ్‌పీవో ప్రోత్సాహంతో చిరుధాన్యాలను సాగు చేస్తున్నాను. గత సంవత్సరం రెండు ఎకరాల్లో సామాలు పంట వేయగా 2000 కిలోలు దిగుబడి వచ్చింది. ఈ సంవత్సరం 2.50ఎకరాల్లో సామలు, రాగుల పంటలను వేశాను. దిగుబడి బాగానే ఉంది. ఈ పంటలు లాభసాటినే ఉంది.

– చినమత్స్యకొండబాబు, రైతు, గడుతూరు గ్రామం

ఆశాజనకంగా పెట్టుబడి



రాగులు, సామలు వంటి చిరుధాన్యాల పంటలతో రైతులకు ఆదాయం బాగానే వస్తుంది.మొదటి సంవత్సరం సామలు, రాగుల పంటలు ఒక ఎకరంలో వేశాను. పంటల దిగుబడి వచ్చింది. ఈ సంవత్సరం రెండు ఎకరాల్లో ఈ పంటలు వేశాను. ఇంటి అవసరాలకు మినహాయించి మిగతా పంటను విక్రయిస్తున్నాం

– ఐసరం మహేశ్వరి, మహిళా రైతు, సొలభం గ్రామం, జి.మాడుగుల మండలం

సాగుపై అవగాహన



గ్రామాల్లో చిరుధాన్యాల సాగుకు ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం 800 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు ఉంది. రైతులకు విత్తనాలు ఉచితంగా ఇస్తున్నాం. అధికారులు సూచనలు, సలహాలిస్తున్నారు. మరెన్ని గ్రామాలకు చిరుధాన్యాల సాగును మరింత విస్తరిస్తాం.

– ఐసరం హనుమంతరావు, సీఈవో, శ్రీమత్స్యదేవత ఎఫ్‌పీవో, జి.మాడుగుల మండలం

రైతులకు శిక్షణ



సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించాం. జీవామృతాలు, కషాయాలు తయారీ వాడకంపై శిక్షణ ఇస్తున్నాం. చిరుధాన్యల సాగు వల్ల కలిగే లాభాలు, మార్కెటింగ్ వంటిని ప్రయోజనాలను వివరిస్తున్నాం. చిరుధాన్యాల పంటలపై రైతులకు తగిన సూచనలు, సలహాలను అందిస్తున్నాం.

– పాత్రుడు, మండల వ్యవసాయాధికారి, జి.మాడుగుల

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నూతన కార్యవర్గ సభ్యులు

చింతూరు: వలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పించడంతో పాటు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వలంటీర్ల మండల స్థాయి సదస్సు ఆదివారం చింతూరులో జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వలంటీర్లకు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తానన్న హామీని నెరవేర్చాలని, వలంటీర్లకు విధి విధానాలు, జాబ్‌చార్ట్ ప్రకటించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక: సదస్సులో భాగంగా ఏపీ గ్రామ వార్డు వలంటీర్ల యూనియన్ అనుబంధ సంఘాన్ని 27 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పొడియం బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా కలుముల మహేష్, కోశాధికారిగా సోడె దుర్గారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పొడియం జానీ ఎన్నికయ్యారు. రామిరెడ్డి, దుర్గారావు, లక్ష్మి, సీత పాల్గొన్నారు.

ఘనంగా మోక్షగుండం జయంతి



పి.యర్రగొండ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంజనీరింగ్ డే వేడుకలు

వై.రామవరం: ఇంజనీరింగ్ డేను పురస్కరించుకుని మండలంలోని పి.యర్రగొండ గ్రామ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం భారతరత్న డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదిన వేడుకలను ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం



సతకంపట్టు వీధిలో వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాక్షి,పాడేరు: వినాయక చవితి పురస్కరించుకొని గ్రామాల్లోని మండపాల్లో పూజలందుకుంటున్న గణనాథుని విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పాడేరు పట్టణంతో పాటు మినుములూరు, వంట్లమామిడి కొండవీధి గ్రామాల్లో గణనాథుని విగ్రహాల నిమజ్జనం ఉరేగింపు సందడి నెలకొంది. సమీప గెడ్డలలో గణపతి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హుకుంపేట సతకంపట్టు వీధిలో ఏర్పాటు చేసిన మండపంలోని వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సైని సత్తిబాబు, పలు పార్టీల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఊరేగింపులో చిన్నారులు, యువత సందడి చేశారు. సమీపంలోని గెడ్డలో గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన వేడుక ఘనంగా జరిగింది. విగ్రహ దాత నెమలిపూరి సూర్యకుమార్(రాజు) యువతను ప్రోత్సహిస్తు అల్లూరి టీ షర్టులను అందజేశారు. నిమజ్జన ఊరేగింపులో డప్పు వాయిద్యాల నడుమ చిన్నారులు, యువత థింసా నృత్యాలతో సందడి చేశారు. సమీప చాపరాయి గెడ్డలో గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. సూర్యప్రకాష్, నవసూర్యలు, మండ్యాగురు, అవినాష్, మండ్యగురు, స్వామి, సుధాకార్, సంజీవ్, సింహాద్రి తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చింతపల్లి: సాయినగర్‌లో వినాయకుని నిమజ్జన కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. మండల కేంద్రంలో గల సాయినాథ్ ఆలయం నుంచి పురవీధుల్లో విఘ్నేశ్వరుని ప్రతిమలను ఊరేగించారు. ఈ సందర్భంగా థింసా నృత్యాలు, కోయ డ్యాన్సులు, తప్పెటగుళ్ల తదితర సంప్రదాయ కార్యక్రమాలతో అలరించారు. గిరిజన ఉద్యోగ సంఘం నాయకుడు మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగింది.

గంగవరం: మండల కేంద్రంలోని గణనాథుని నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. విగ్రహ ఊరేగింపులో చిన్నారులు, యువత సందడి చేశారు.



వంట్లమామిడి కొండవీధిలో గణపతి విగ్రహం ఊరేగింపులో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సభ్యులు



చింతపల్లిలో ఊరేగింపులో థింసా నృత్యాలు



గంగవరంలోని గణనాథుని విగ్రహ ఊరేగింపు

ప్రధానోపాధ్యాయునికి పురస్కారం



అవార్డును తీసుకుంటున్న గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు

పెదబయలు: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1 ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు ఆచార్య దేవోభవ జాతీయ పురస్కారం అందుకున్నారు. తిరుపతిలోని విశ్వం విద్యా సంస్థలో జరిగిన కార్యక్రమంలో యువతేజం కలం ట్రస్టు ఆధ్వర్యంలో ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ పురష్కారాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు జి.సుబ్రహ్మణ్యశర్మ, నారాయణ స్వామి, కరిముల్లా చేతుల మీదుగా తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉత్తమ సేవలందిస్తున్న 190 మంది ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాన్ని అందించినట్టు చెప్పారు. అల్లూరి జిల్లా నుంచి మొట్టమొదటి సారిగా ఈ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు చెండా బాలకృష్ణ, నాయుడు, తలారి చక్రధర్, మందన్న, విశ్వనాథ, రవికుమార్, బాలన్న, చిరంజీవి, సత్యనారాయణ, అనిల్ తదితరులు హెచ్‌ఎం నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

డ్యాన్స్ పోటీలకు విశేష స్పందన



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, తదితరులు



డాన్స్ చేస్తున్న చిన్నారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక అల్లూరి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. సరిహద్దు గ్రామాల నుంచి చిన్నారులు, యువత డ్యాన్స్ పోటీల్లో పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు. శనివారం రాత్రి నిర్వహించిన డ్యాన్స్ పోటీలకు భారీ సంఖ్యల్లో ప్రజలు పాల్గొని డాన్సలను తిలకించారు. డ్యాన్స్ పోటీలో జూనియర్స్ సింగిల్స్‌లో హిమనంది ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతిని సౌమ్య, తృతీయ బహుమతిని శాన్వీలు గెలుచుకున్నారు. జూనియర్స్ గ్రూపులో బటర్ ఫ్లై ప్రథమ, మను, హనీలు ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు.సినియర్స్ సింగిల్స్‌లో జోలాపుట్టు సాయి ప్రథమ, చందిని ద్వితీయ, శ్రీజతేజలు తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. సినీయర్స్ గ్రూప్స్‌లో శరభపుట్టు గ్రూపు ప్రథమ బహుమతి, ఎస్‌కె గల్లీ బాయ్స్ జోలాపుట్టు ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు వెలుగు ఏపీఎం దేవమంగ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యాయులు అవినాష్, త్రినాథ్‌లు, అల్లూరి యూత్ సభ్యుల చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఏటా వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్థానిక యువతలో దాగున్న డ్యాన్స్ ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నామని అల్లూరి యూత్ సభ్యులు ఉవయ్, గణపతి, రవి, శ్రీను, కిరణ్, మురళి, ఆచారి, కృష్ణ, సతీష్, గణేష్ తదితరులు తెలిపారు.

అక్రమ నిర్మాణం తొలగింపులో నిర్లక్ష్యం తగదు



అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు బృందం

అరకులోయ రూరల్: అక్రమ నిర్మాణలు తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం తగదని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి సంబంధించిన ప్రభుత్వ స్థలంలో టీడీపీకి చెందిన పెదలబుడు సర్పంచ్ దాసుబాబు చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని గిరిజన సంఘం నాయకుల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ అధికార పార్టీ అండదండలతో ప్రభుత్వ భూమిని అక్రమించుకుని దాసుబాబు నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ తక్షణమే తొలగించాలన్నారు. అక్రమణకు గురైన స్థలాన్ని ఐటీడీఏ స్వాధీనం చేసుకోవాలన్నారు. గతంలో పలుమార్లు ఈ స్థలంపై ఫిర్యాదులు చేశామన్నారు. కూటమి ప్రభుత్వ అండదండలతో భారీ ఎత్తున షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అటవీశాఖ స్థలంలో గిరిజనేతరులు రమేష్, కృష్ణారావుల కబ్జా

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న అటవీ శాఖకు సంబంధించిన ప్రభుత్వ స్థలంలో గిరిజనేతరుడైన రమేష్ ఆక్రమించుకుని మరో గిరిజనేతరుడు కాపుగంటి కృష్ణారావుకు విక్రయించారని, ఈ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణలపై గతంలో అధికారులు, కలెక్టర్‌కు పలుమార్లు ప్రజా సంఘాలు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందన్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఏజెన్సీలో 1/70, పీసా చట్టాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అక్రమ నిర్మాణలు చేయకూడదనే నిబంధనలు ఉన్నా అధికారుల అండదండలతో గిరిజనేతరులు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని లేనిపక్షంలో ఆదివాసీ, ప్రజా సంఘాలతో కలిసి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. నాయకులు బాలదేవ్, బుజ్జిబాబు, చిన్నబాబు, మగ్గన్న, జగన్నాథం, జోషి తదితరులు పాల్గొన్నారు.

విజయదశమి ఉత్సవ కమిటీ ఏర్పాటు



వి.సత్యనారాయణ



వై.శ్రీనివాస్

సాక్షి,పాడేరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఆక్టోబర్ 8 నుంచి 12వతేదీ వరకు నిర్వహించనున్న విజయదశమి ఉత్సవాలకు నూతన ఉత్సవ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు.ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెయ్యాకుల సత్యనారాయణ, యాదగిరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా శివకుమార్, రమణ, కార్యదర్శిగా కొండబాబు, సహాయ కార్యదర్శులుగా రాంనాయుడు, ఎండీ. తాజ్, వెంకట్, కోశాధికారులుగా బూరెడ్డి రాము, రవీంద్రను ఎన్నుకున్నారు.

కమిటీ సభ్యులుగా చంటి, ప్రతాప్, కొండబాబు, విశ్వనాథం, చిట్టిబాబు, సురేష్, గణేష్, రవి ఎన్నికయ్యారు.ఈ ఏడాది విజయదశమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గం కోరింది.

బాబ్జీదొరకు అభినందనలు



బాబ్జీదొరను సత్కరిస్తున్న సభ్యులు

రాజవొమ్మంగి: ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా మండలానికి చెందిన కొంగర బాబ్జీదొరను ఎన్నుకున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య తెలిపారు. సంక్షేమ వేదిక కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జడ్డంగిలో జరిగింది. గిరిజనులు, దళితులకు ఏ అన్యాయం జరిగినా వేదిక దృష్టికి తీసుకొని రావాలని సుబ్బయ్య కోరారు. సర్పంచ్ కొంగర మురళీకృష్ణ తదితరులు హాజరయ్యారు.

అహింసా మార్గంతో సమస్యలు దూరం

కశింకోట : ధ్యానం, అహింసా మార్గం పాటిస్తే అన్ని సమస్యల నుంచి బయట పడవచ్చని మహా కరుణ ధర్మ ప్రచార పరిషత్ సమితి చైర్మన్ దాట్ల రాయ జగపతిరాజు అన్నారు. మహా కరుణ యాగంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1200 గ్రామాల్లో నిర్వహించడానికి చేపట్టిన ఇంటింటి ధర్మ ప్రచార పాదయాత్ర ఆదివారం కశింకోటలోని గవరపేటలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరూ ధ్యానం ఆచరించాలని, మాంసాహారాన్ని త్యజించి శాకాహారాన్ని భుజించాలని కోరారు. ధ్యాన సాధన వల్ల జ్ఞానం అలవడుతుందన్నారు. ఆగస్టు 11న అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వద్ద ఉన్న ప్రకృతి వ్యాలీ ధ్యాన మందిర గ్రామం నుంచి ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమానికి విశేష మహిళాదరణ లభించింది.